నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 19 ఆగస్టు 2024 | KAMAREDDY


# రైతులకు అండగా నిలవాలి..

## బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల పిలుపు



మోర్తాడ్, ఆగస్టు 18: గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకునే రుణమాఫీ కాలేని రైతులకు నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ అండగా నిలవాలని, వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దరఖాస్తు చేసుకునే రైతులకు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే స్థానికంగా ఉండే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను సంప్రదించాలని రైతులకు సూచించారు. రుణం తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ అయ్యేవరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

# సీఎం రేవంత్‌రెడ్డి.. క్షమాపణ చెప్పాలే..

- గ్రామాల్లో 40శాతం కూడా రుణమాఫీ కాలేదు..
- కాంగ్రెస్ బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చింది..
- ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దౌర్జన్యం సిగ్గుచేటు
- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

కామారెడ్డి, ఆగస్టు 18: కాంగ్రెస్ పార్టీ తొమ్మిది నెలల క్రితం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి రైతులకు ఆగస్టు 15వ తేదీ వరకు పూర్తిగా రుణమాఫీ చేస్తామని చెప్పారని, రాష్ట్రంలో ఏ జిల్లాకు వెళ్లినా.. ఆ జిల్లాలోని ప్రముఖ దేవాలయాల మీద ఒట్టు వేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకొని హామీని మరిచిపోయారని అన్నారు. వందశాతం రుణమాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు.. సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే క్యాంపు కార్యాలయంపై గుండాలను పంపించి దౌర్జన్యం చేయించారని, దానికి పోలీసులు వత్తాసు పలకడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారి పోయాయని అన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు వెళ్లినా హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, దొంగతనాలు పెరిగిపోయాయని అన్నారు. సిద్దిపేటలో అర్ధరాత్రి జరిగిన సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని, బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ఊరుకునేది లేదని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీని వంద శాతం అమలు చేసేలా బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన నిలుస్తుందని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా 30 నుంచి 40 శాతం వరకు కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏ సీఎం ప్రవేశపెట్టని రైతుబంధును కేసీఆర్ ప్రవేశపెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుబంధు పడలేదని అన్నారు. దేశంలో అతి తక్కువ కాలంలోనే సీఎం దిష్టిబొమ్మను దహనం చేసే వరకు దిగజారిన ఏకైక వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మల శవయాత్ర చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.



కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జపల్లి తండా గ్రామంలో రైతు రుణమాఫీ జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

రైతులకు రుణమాఫీ రంది పట్టుకున్నది. ఒకటో విడుతలో రాని వారికి రెండో విడుతలో వస్తుందని, రెండో విడుతలో రాని వారికి మూడో విడుతలో వస్తుందని చెప్పిన మాటల్లన్నీ కల్లబొల్లివేనని తేలిపోయింది. రూ.2లక్షల వరకు సంపూర్ణ రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. అర్హతలున్నా కొర్రీల పేరిట మాఫీ వర్తింపజేయలేదంటూ రైతులంతా మండిపడుతున్నారు. మూడు విడుతల్లోనూ అర్హులైన తమకు నిరాశే మిగిలిందని నిట్టూరుస్తున్నారు. చివరి విడుతలోనైనా మాఫీ వస్తుందనుకున్న తమను ఈ కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

- కామారెడ్డి/ కామారెడ్డి రూరల్, ఆగస్టు 18

## గందరగోళంగా రుణమాఫీ ప్రక్రియ

# మూడో విడుతా.. ముంచింది

- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతాంగం
- అధికారుల పొంతనలేని సమాధానాలతో అన్నదాతల ఆగ్రహం
- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఉమ్మడి నిజామాబాద్‌లో జిల్లాలో రూ.రెండు లక్షల లోపు రుణాలు మాఫీ కాలేని రైతులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ..అర్హులైన తమకు మాఫీ చేయలేదని అసహనం వ్యక్తంచేస్తున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొదటి విడుతలో 49,540 మంది రైతులకు రూ.231.13 కోట్లు రుణమాఫీ అయ్యాయి. రెండో విడుతలో 24,816 మంది రైతులకు రూ.211.72 కోట్లు, మూడో విడుతలో 17,543మంది రైతులకు రూ.212.52కోట్లు మాఫీ అయినట్లు అధికారవర్గాలు తెలిపాయి. మూడు విడుతల్లో మొత్తం 91,899 మంది రైతులకు రూ.655.37 కోట్లు మాఫీ అయ్యింది. పలు గ్రామాల్లో కొందరికి మాఫీ అయి.. మరికొందరికి మాఫీ రాకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. రుణమాఫీ అంతా గందరగోళంగా ఉన్నదని, వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లను అడిగితే కల్లబొల్లి మాటలు చెబుతున్నారని పేర్కొంటున్నారు.

### మా ఇంట్లో ఎవరికీ రుణమాఫీ కాలేదు



నా కొడుకు, నేను విడివిడిగా ఉంటాం. నా భార్య పేరు మీద మూడు ఎకరాల భూమికి రూ.రెండు లక్షల లోన్ ఉన్నది. నా కొడుకు పేరు మీద, నా పేరు మీద రూ. 2లక్షల రుణం ఉన్నది. కుటుంబానికి రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెసోళ్లు చెప్పిండ్రు. కానీ మా ఇంట్లో ఎవరికీ రుణమాఫీ చేయలేదు.

**- లింగుపల్లి నారాయణ, తిమ్మక్‌పల్లి, కామారెడ్డి మండలం**

### తప్పుడు మాటలు చెప్పారు..



రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు మాటలు చెప్పింది. నా పేరు మీద మూడు ఎకరాల భూమి ఉంటే రూ.లక్షా 50 వేల లోన్ తీసుకున్నాను. అయినా నాకు రుణమాఫీ కాలేదు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం మా అప్పులను మాఫీ చేసి ఆదుకోవాలి.

**- దాక రాజమణి, రైతు, తిమ్మక్‌పల్లి**

### రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి..



దేశానికి వెన్నుముఖ లాంటి రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు మాఫీ చేయకుండానే మాట తప్పుతున్నది. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి. లేదంటే రైతులకు ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదు.

**- ద్యావరిశెట్టి నారాయణ, రైతు, తిమ్మక్‌పల్లి**

### మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం



అధికారంలోకి రాకముందు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది. మాకు ఐదు ఎకరాల పొలం ఉన్నది. రూ.రెండు లక్షల వరకు లోన్ తీసుకున్నాను. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు రుణాలను మాఫీ చేస్తామని చెప్పడంతో కట్టకుండా ఉన్నాం. మూడు విడుతలు అయిపోయినా నాకు రుణమాఫీ రాలేదు. ఇప్పుడు తీసుకున్న అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

**- భాస్కర్, రైతు, తిమ్మక్‌పల్లి**

### ఇదేం పద్ధతి



వేల్పూర్, ఆగస్టు 18: ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఇప్పుడేమో రుణమాఫీ మాకు కాలేదని చెబితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయుమని చెబుతున్నారు. గిదేమి పద్ధతి. సీటు మీద కూర్చోక ముందు ఒకటి.. కూర్చున్నాక ఒకటి... ఇది సరైంది కాదు. రుణమాఫీ అందరికీ ఇవ్వాలి.

**- మామిడి గంగారాం, దొన్కల్, మోర్తాడ్**

### కాంగ్రెస్ నాయకులు మోసగాళ్లు



వేల్పూర్, ఆగస్టు 18: రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఓట్లు వేసిన తర్వాత మోసం చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని దేవుళ్ల మీద ప్రమాణం చేసి చెప్పారు. ఇప్పుడేమో కొందరికే రుణమాఫీ చేశారు. దేవుళ్ల మీద ఒట్టు వేసి మోసం చేసిన పార్టీ అధికారంలో ఎక్కువ రోజులు ఉండదు.

**- దమ్మాయి గంగాధర్, వేల్పూర్**

## మోసం చేశారని పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన

# పట్టాల పంచాయితీ..

వినాయక్‌నగర్, ఆగస్టు 18: నిజామాబాద్ నగర శివారులోని నాగారం పరిధిలోని బొందం గడ్డ శిఖం భూమి కబ్జా చేసి అక్కడ అక్రమ నిర్మాణాలు చేశారని శుక్రవారం ఆర్డీవో సమక్షంలో పోలీసు బందోబస్తుతో రెవెన్యూ అధికారులు నిర్మాణాలను కూల్చి వేయించిన విషయం తెలిసిందే. దీంతో ఆ ప్రాంతంలో తాత్కాలిక నిర్మాణాలతోపాటు ఇండ్లు నిర్మించుకున్న వారంతా నిరాశ్రయులయ్యారు. ఇండ్లను కోల్పోయిన వారంతా కుటుంబసభ్యులతో కలిసి ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. ఠాణా ప్రాంగణంలో ధర్నా చేయగా.. ఎంఐఎం కార్పొరేటర్లు, నాయకులు బాధితులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ స్థానిక నాయకులైన శేఖర్, నరేశ్, మహ్మద్ తమ కు రూ.2లక్షల 55 వేలకు ప్లాట్‌ను విక్రయించారని, వారికి డబ్బులు చెల్లించి తాము ప్లాటు కొనుగోలు చేశామని తెలిపారు. అద్దె ఇండ్లల్లో ఉండే తాము వారి నుంచి ప్లాట్లు కొనుగోలు చేసి ఇండ్లు నిర్మించుకున్నామన్నారు. అంతేకాకుండా తమకు విద్యుత్ మీటర్లు సైతం మంజూరు చేశారని తెలిపారు. తమకు నకిలీ పట్టాలు అంటగట్టి మోసం చేసి న వారిపై చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని బాధితులు ఐదో టౌన్ ఎస్సైకి ఫిర్యాదు చేశారు.



పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బైఠాయించిన బాధితులు

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



బహుజన ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. సర్దార్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, అంకిత్ పాల్గొన్నారు.

## డ్రైనేజీలో శిశువు మృతదేహం

# పాపం..పసికందు

వినాయక్‌నగర్, ఆగస్టు 18: పాల పెదవుల ఆర్తి తీరలేదు.. కండ్లు కూడా ఇంకా తెరుచుకోనే లేదు.. పేగు తాడు తడి కూడా ఆరలేదు.. పాపం.. పసికందు.. ఇష్టం లేకనో.. ఇప్పుడే వద్దనుకున్నారో ఏమో తెలియదు కానీ...అభం..శుభం తెలియని నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు డ్రైనేజీలో పారవేశారు. హృదయ విదారకమైన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం వెలుగు చూసింది. కండ్లు తెరిచి లోకాన్ని చూడలేని ఓ పసికందును నిర్దాక్షిణ్యంగా మురికి కాలువలో పారవేసిన దృశ్యాన్ని చూసిన స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న డ్రైనేజీలో ఓ పసికందు పడి ఉండాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా సుమారు ఒకటి, రెండు రోజుల క్రితం జన్మించిన ఆడబిడ్డగా గుర్తించారు. ఆ పాప అప్పటికే మరణించినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ విషయంపై రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉన్నవారిని పోలీసులు విచారిస్తున్నారు. అంతేకాకుండా స్టేషన్ ఏరియాలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీను సైతం పరిశీలిస్తున్నారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు సూచనలతో పసికందు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఆవిరైన అలీసాగర్ నీటి ఆశలు**

పాలకుల వాయిదా నిర్ణయంతో హతాశులైన రైతులు

9లో..

# నేడు రక్షాబంధన్

- ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ
- శ్రావణ పూర్ణిమ వేళ సోదరులకు రక్షగా..



అక్కాతమ్ముళ్ల, అన్నాచెల్లెళ్ల ఆత్మీయ పండుగ రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు సోమవారం జరుపుకోనున్నారు. జంధ్యాల పౌర్ణమి, శ్రావణపౌర్ణమి పేర్లతో జరుపుకొనే రాఖీ పౌర్ణమి పర్వదినానికి విశేష ప్రాముఖ్యత ఉన్నది. వేదపఠనం అభ్యసించే విద్యార్థులు నేటి నుంచే విద్యాభ్యాసాన్ని ఆరంభిస్తారు. శివకేశవులకు ప్రీతికరమైన శ్రావణమాసంలో శ్రవణా నక్షత్రం అత్యంత శుభ, లాభాలు కలిగించే నక్షత్రం సోమవారంతో కలిసి రావడం శుభప్రదమని పండితులు చెబుతున్నారు. నేను నీకు రక్ష... నీవు నాకు రక్ష... మనమిద్దరమూ కలిసి దేశానికి రక్ష... అన్న సూక్తిని రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీలు కట్టుకొని చెప్పుకోవడం మన సంప్రదాయం. జంధ్యాల పౌర్ణమి పురస్కరించుకొని వేద ధ్యానం, వేద పఠనం కోసం పండితులు నూతన యజ్ఞోపవీతాలను ధరించడం ఆనవాయితీ. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రధాన పట్టణాల్లోని చౌరస్తాల వద్ద రాఖీ విక్రయ కేంద్రాలు

–కామారెడ్డి / సుభాష్‌నగర్, ఆగస్టు 18:





కామారెడ్డిలో రాఖీ సెంటర్ల వద్ద కొనుగోలుదారుల సందడి







పదికాలాలూ మదిలోనే..

ఫొటోగ్రఫీ మధుర అనుభూతిని పంచుతుంది...జ్ఞాపకాలను పదికాలాలపాటు పదిలంగా ఉంచడంతోపాటు భవిష్యత్తు తరాలకు వాటి మాధుర్యాన్ని అందిస్తుంది. ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదలాడుతాయి. కాలం కరిగిపోయినా.. ఫొటోను చూడగానే చెదిరిపోయిన జ్ఞాపకాలన్నీ మనసులో మెదులుతాయి. అనేక మధుర ఘట్టాలు, సాధించిన విజయాలు, బాధలు, అద్భుత సన్నివేశాలు.. ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకొని మళ్లీమళ్లీ గుర్తు తెచ్చుకునే అవకాశం ఫొటోతోనే సాధ్యం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నమస్తే ఫొటోగ్రాఫర్ తీసిన కొన్ని ఛాయాచిత్రాలు మీకోసం..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్, ఆగస్టు 18